క్లుప్తంగా

ప్రభుత్వ భూముల సర్వే


ఉమ్రి(కే)లో రికార్డులు పరిశీలిస్తున్న సిబ్బంది

తానూరు: మండలంలోని బెంబర, ఉమ్రి(కే), బోరిగాం, బోల్సా, బామ్ని గ్రామాల్లో గురువారం రెవెన్యూ అధికారులు పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ భూముల వివరాలను సేకరించారు. గత రికార్డుల వివరాలతో పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటరమణ, ఆర్ఐ గంగాధర్, నాయకులు మారుతి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు తదితరులు ఉన్నారు.

క్రీడాసామగ్రి అందజేత

ఖానాపూర్: మండలంలోని కొలాంగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం క్రీడా సామగ్రి అందజేశారు. హెచ్ఎం బెల్లాల రాజశ్రీనివాస్, ఉపాధ్యాయుడు రాజశేఖర్ పాఠశాల నిధులు రూ.ఐదు వేలతో ఫుట్‌బాల్, షటిల్ బ్యాట్‌లు తదితర సామగ్రిని కొనుగోలు చేసి విద్యార్థులకు అందించారు. బావాపూర్(ఆర్) గ్రామానికి చెందిన ఎక్కిరాల విజయ్ అనే దాత సహకారంతో 25 మంది పాఠశాల విద్యార్థులకు పాదరక్షలు అందించారు.

జిల్లా సమావేశం జయప్రదం చేయాలి


మాట్లాడుతున్న నాయకులు

కడెం: మండల కేంద్రంలోని హరిత రిసార్ట్‌లో ఈనెల 13న నిర్వహించే సీపీఐ(ఎం) జిల్లా స్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యవర్గ సభ్యులు దుర్గం నూతన్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో మాట్లాడారు. పోడు పట్టాల పంపిణీ, కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై మతోన్మాదంపై దేశవ్యాప్త ప్రచారం, ఉపాధి కూలీలకు 200 రోజుల పని తదితర అంశాలతోపాటు భవిష్యత్ కార్యాచరణ చర్చిస్తామని పేర్కొన్నారు. ఏరియా కమిటీ సభ్యుడు తిరుపతి, పోశలింగం ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

భైంసాటౌన్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను గురువారం పట్టుకున్నట్లు తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని హంపోలి(కె) గ్రామంలోని వాగు నుంచి రెండు ట్రాక్టర్లు, పట్టణంలో మరో ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకుని రూ.5 వేల చొప్పున జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. రెవెన్యూ అధికారుల అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

'కంటివెలుగు' ప్రారంభం


శిబిరం ప్రారంభిస్తున్న సర్పంచ్ వేణుగోపాల్

కడెం: మండలంలోని కొండుకూర్ గ్రామంలో గురువారం సర్పంచ్ వేణుగోపాల్ కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా పలువురికి కంటిపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీవో వెంకటేశ్, రైతుబంధు సమితి మండల కన్వీనర్ జీవన్‌రెడ్డి, డాక్టర్ అనిల్, హెల్త్ సూపర్‌వైజర్ గోపాల్, ఏఎన్ఎం రాణి తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

కడెం: లబ్ధిదారులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఐసీడీఎస్ బెల్లాల్ సెక్టార్ సూపర్‌వైజర్ శ్రీలత అన్నారు. గురువారం మండలంలోని నర్సాపూర్, లింగాపూర్ అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడారు. ప్రీ స్కూల్ కార్యక్రమాలను తప్పనిసరిగా నిర్వహించాలని సిబ్బందికి సూచనలు చేశారు. మండలంలోని పెద్దూర్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు స్థానిక పాఠశాల హెచ్ఎం భూమేశ్, అంగన్‌వాడీ టీచర్ రాజేశ్వరి అక్షరాభ్యాసం చేయించారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు


గంగాధర్

తానూరు: మండల కేంద్రానికి చెందిన ముక్కెర్‌వార్ గంగాధర్(65) అనే వ్యక్తి అదృశ్యమవగా.. కేసు నమోదు చేసినట్లు ఎస్సై విక్రమ్ పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం తానూరుకు చెందిన గంగాధర్ ఈనెల 6న మహారాష్ట్రలోని సైలాని బాబా గ్రామానికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికారు. ఆచూకీ దొరకక పోవడంతో కుటుంబసభ్యులు గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

'పది'పై ప్రత్యేక నజర్

- విద్యార్థులకు కొనసాగుతున్న స్టడీ అవర్స్
- వందశాతం ఫలితాలే లక్ష్యం
- సామర్థ్యాల వారీగా గ్రూపుల ఏర్పాటు
- 15 నుంచి రెండో ప్రీఫైనల్ పరీక్షలు


స్టడీ అవర్‌లో వడ్యాల్ పాఠశాల విద్యార్థులు

లక్ష్మణచాంద: పదో తరగతిలో వందశాతం ఫలితాలే లక్ష్యంగా విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా ఇప్పటికే సిలబస్ పూర్తి చేసిన ఉపాధ్యాయులు రివిజన్ చేస్తూ విద్యార్థుల సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తున్నారు. ఇటీవల ఒకటో ప్రీఫైనల్ పరీక్షలు రాసిన విద్యార్థులు.. ఈనెల 15 నుంచి రెండో ప్రీఫైనల్ పరీక్షలు రాసేందుకు సమాయత్తం అవుతున్నారు. రోజువారీ పరీక్షల్లో చేస్తున్న తప్పులపై విద్యార్థులకు అవగాహన కల్పించడంతోపాటు ఒత్తిడికి గురికాకుండా పలు సూచనలు చేస్తున్నారు ఉపాధ్యాయులు.

మండలంలో 277 మంది విద్యార్థులు..

లక్ష్మణచాంద మండలంలో ఏడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో మొత్తం 277 మంది పదో తరగతి విద్యార్థులు ఉన్నారు. లక్ష్మణచాంద ఉన్నత పాఠశాలలో 88 మంది, వడ్యాల్ ఉన్నత పాఠశాలలో 50 మంది, బాబాపూర్ ఉన్నత పాఠశాలలో 25 మంది, పీచర ఉన్నత పాఠశాలలో 19 మంది, చామన్‌పెల్లి ఉన్నత పాఠశాలలో 28 మంది, మల్లాపూర్ ఉన్నత పాఠశాలలో 18 మంది, పార్‌పెల్లి ఉన్నత పాఠశాలలో 11 మంది, కేజీబీవీలో 38 మంది విద్యార్థినులు పదో తరగతి చదువుతున్నారు.

గ్రూపుల బాధ్యత ఉపాధ్యాయులకు..

మండలంలోని అన్ని పాఠశాలల్లో పదోతరగతి చదివే విద్యార్థులను వారి సామర్థ్యాలను బట్టి వివిధ గ్రూపులుగా విభజించారు. ఒక్కో గ్రూపులో ఆరు నుంచి పది మంది విద్యార్థుల వరకు ఉన్నారు. ఈ గ్రూపుకోక ఉపాధ్యాయుడిని ఇన్‌చార్జిగా కేటాయించారు. దీంతో పాఠ్యాంశాల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వారిని తీర్చిదిద్దుతున్నారు. దీనికి తోడు పరీక్షలంటే విద్యార్థులకు భయం పోగొట్టేలా వారితో ధ్యానం చేయిస్తూ మానసికంగా దృఢంగా తయారు చేస్తున్నారు.

నిత్యం రెండు గంటలు..

వార్షిక పరీక్షలు ఏప్రిల్ మూడో తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. కలెక్టర్ వరుణ్‌రెడ్డి, డీఈవో రవీందర్‌రెడ్డి ఆదేశాల మేరకు అన్ని పాఠశాలల్లో ఉదయం 8.30 గంటల నుంచి 9.30 గంటల వరకు, మళ్లీ సాయంత్రం 4.30 గంటల నుంచి 5.30 గంటల వరకు ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. స్టడీ అవర్స్‌లో అలసిపోకుండా విద్యార్థులకు స్నాక్స్ కూడా అందిస్తున్నారు.

ఉత్తమ ఫలితాలు సాధిస్తాం



మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో 277 మంది పదో తరగతి చదువుతున్నారు. వీరిని పరీక్షలకు అన్ని విధాల సిద్ధం చేస్తున్నాం. ఉత్తమ ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నాం. – మధుసూదన్, ఇన్‌చార్జి ఎంఈవో

నివృత్తి చేసుకుంటున్నాం



నిత్యం స్టడీ అవర్స్‌లో మాకు వచ్చిన సందేహాలను ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకుంటున్నాం. వార్షిక పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించి మా పాఠశాలకు మంచి పేరు తీసుకొస్తాం. – వైష్ణవి, పదోతరగతి, వడ్యాల్

ప్రణాళికతో చదువుతున్నాం



ఇష్టానుసారం కాకుండా ఉపాధ్యాయులు చెప్పినట్లు ప్రణాళికతో చదువుతున్నాం. దీంతో ఒత్తిడి అన్పించడం లేదు. మంచి జీపీఏ సాధిస్తామనే నమ్మకం ఏర్పడింది. – రాణి, పదోతరగతి, వడ్యాల్

సమష్టిగా పనిచేస్తున్నాం



ఉపాధ్యాయులమంతా సమష్టిగా పని చేస్తూ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. వెనుకబడిన వారిపై దృష్టి సారించి విద్యార్థులు ఒత్తిడికి గురి కాకుండా చర్యలు తీసుకుంటున్నాం. – అశోక్‌వర్మ, ప్రధానోపాధ్యాయుడు, వడ్యాల్

మండల అభివృద్ధికి కృషి చేస్తా

- ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి


రాజూరలో భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

లోకేశ్వరం: మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని.. త్వరలో గ్రామాల్లోని వ్యవసాయ రోడ్లకు నిధులు మంజూరు చేస్తానని ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని రాజూర గ్రామంలో సీసీరోడ్లు, రాజూర నుంచి గడ్‌చాంద వరకు మట్టి రోడ్డుకు, డ్రైయినేజీ పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈసందర్భంగా రాజూరలో ఆయా గ్రామాలకు చెందిన 12 మందికి షాదీముబారక్, ఇద్దరికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందించారు. రాజూరలో సీసీ రోడ్లకు రూ.27 లక్షలు, డ్రైయినేజీ పనులకు రూ.10 లక్షలు, రాజూర నుంచి గడ్‌చాంద వరకు రూ.2.50 లక్షలు మంజూరు చేశామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ముత్తగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు, మాజీ సర్పంచ్ పోతన్న, శేఖర్‌రెడ్డి, సాయారెడ్డి, భోజన్న, ప్రశాంత్, భూమన్న, శ్రీనివాస్ ఉన్నారు.


తానూరులో సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠాపనకు హాజరైన భక్తులు

తానూరులో సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠాపన

తానూరు: సాయిబాబా ఆలయ అభివృద్ధికి పూర్తిస్థాయిలో కృషి చేస్తామని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన సాయిబాబా ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు పింటు మహరాజ్ ఆధ్వర్యంలో హోమం నిర్వహించి ప్రతిష్ఠాపన చేశారు. మహిళలు మంగళ హారతులతో వచ్చి ఆలయంలో పూజలు చేశారు. ఆలయ కమిటీ, గ్రామ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ తాడేవార్ విఠల్, మాధవ్‌రావ్ పటేల్, పీఏసీఎస్ చైర్మన్ నారాయణ్‌రావ్ పటేల్, మాజీ ఎంపీపీ బాశెట్టి రాజన్న, పోతారెడ్డి, గ్రామ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మంచి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి



కుంటాలలో నృత్యం చేస్తున్న విద్యార్థులు

కుంటాల: విద్యార్థులు కష్టపడి చదివి మంచి భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని కుంటాల ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అన్నారు. గురువారం పాఠశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థుల నృత్యాలు, నాటికలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీకాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భైంసాటౌన్: పట్టణంలోని గురుకృపా వొకేషనల్ జూనియర్ కళాశాలలో గురువారం వీడ్కోలు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం కళాశాల డైరెక్టర్ రామకృష్ణగౌడ్‌ను సన్మానించారు. ప్రిన్సిపాల్ సాయినాథ్, సిబ్బంది ఉన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత


పల్లకి ఊరేగింపులో వార్‌కరి భక్తులు

తానూరు: ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత సాధ్యమని హరిభక్త పారాయణం గంగాధర్ మహరాజ్ శేల్‌గావ్‌కర్ అన్నారు. గురువారం మండలంలోని మొగ్లి గ్రామంలో జ్ఞానేశ్వరి పారాయణం పల్లకి ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. విఠలేశ్వర ఆలయం ప్రాగణంలో ఆరు రోజులుగా కొనసాగుతున్న అఖండ హరినామ సప్తాహ జ్ఞానేశ్వరి పారాయణం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా పారాయణం పల్లకి ఊరేగింపు నిర్వహించగా మహిళలు మంగళహారతులతో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ లక్ష్మణ్, జ్ఞానేశ్వర్, వార్‌కరి భక్తులు ఉన్నారు.

మొగ్లిలో కొనసాగుతున్న అఖండ హరినామ సప్తాహం శుక్రవారం ముగింపు ఉంటుందని సప్తాహం కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం కాల్యకీర్తన అనంతరం భక్తులకు అన్నదానం చేస్తామన్నారు.

దుకాణాలు తొలగింపు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఈద్గా చౌరస్తా నుంచి మంచిర్యాల్ చౌరస్తా వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణాలను గురువారం ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్సైలు దేవేందర్, రాజశేఖర్ మాట్లాడుతూ.. పట్టణ సీఐ మల్లేశ్ ఆదేశాల మేరకు దుకాణాలు తొలగించినట్లు తెలిపారు. రోడ్డుపై తోపుడు బండ్లు, వివిధ రకాల దుకాణాలు ఏర్పాటు చేసి ట్రాఫిక్ అంతరాయం కలిగించొద్దని సూచించారు.

విద్యార్థులకు రాగిజావ పంపిణీ

లక్ష్మణచాంద: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సత్యసాయి ట్రస్టు తరఫున రాగిజావ పంపిణీ చేస్తున్నారు. అందులో భాగంగా గురువారం మండల కేంద్రంలోని పాఠశాలల విద్యార్థులకు రాగిజావ అందజేశారు. పోషకాలు కల్గిన ఆహారం తీసుకోవడంతో విద్యార్థులు చురుగ్గా ఉంటారని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు సుధాకర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

ఖానాపూర్: పట్టణంలోని ఒకటో వార్డు కౌన్సిలర్ కావలి సంతోశ్ సోదరుడు, కాంగ్రెస్ సీనియర్ నేత కావలి శ్రీనివాస్ బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే రేఖా నాయక్ పరామర్శించారు. అనంతరం గోసంపల్లె పంచాయతీ పరిధిలోని నడింపల్లెకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త రాజు నానమ్మ మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. వారి వెంట పలువురు నాయకులు ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం

భైంసారూరల్: మండలంలోని మహాగాం గ్రామంలో గురువారం నిర్మల్ సైనిక్ అచివర్స్ కమిటీ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వీడీసీ సభ్యులు రాజశేఖర్, శంకర్, విశ్వనాథ్, దర్శన్, నారాయణ, పలువురు అచివర్స్ కమిటీ సభ్యులు ఉన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. కంకరేసి పదేళ్లయింది



లోకేశ్వరం: మండలంలోని కన్కపూర్ నుంచి అష్టా గ్రామానికి వెళ్లే మార్గంలో పదేళ్ల కిందట తారు రోడ్డు నిర్మించేందుకు పనులు ప్రారంభించారు. కంకర వేసి పదేళ్లు దాటినా ఇప్పటికీ తారు వేయలేదు. దుమ్ము లేస్తుండటంతో ఈ మార్గంలో రాకపోకలకు వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి తారు రోడ్డు వేయాలని ఇరు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: రఘువంశీ, పీఆర్ ఏఈ, లోకేశ్వరం ఫోన్: 95506 07360

బీరప్ప ఉత్సవాలు

ఖానాపూర్: మండలంలోని తర్లపాడ్ గ్రామంలో బీరప్ప దేవుడి ఉత్సవాలు వారం రోజులుగా ఘనంగా జరుగుతున్నాయి. గురువారం కళాకారులతో ప్రత్యేక గారడీ, ఎట్టి ముల్లెలు తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు. శుక్రవారం దిష్టికుంభంతోపాటు ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ కమిటీ సభ్యులు పెద్ది నర్సయ్య, పెద్ది బీరయ్య, పెద్ది మల్లేశ్, రమేశ్, బీరయ్య తెలిపారు. కరీంనగర్ జిల్లా బీర్ల పూజారి భిక్షపతి ఆధ్వర్యంలో కళాబృందం వేడుకలు నిర్వహిస్తున్నారు.

యువజన సంఘం కార్యవర్గం ఎన్నిక

ఖానాపూర్: పట్టణంలోని తిమ్మాపూర్ మున్నూర్‌కాపు యువజన సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కమిటీ సభ్యులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. యువజన విభాగం గ్రామ అధ్యక్షుడిగా చింతపండు రవి, గౌరవాధ్యక్షుడిగా గోడపురం సందీప్, ఉపాధ్యక్షులుగా వొడ్డెటి నాగరాజు, పూసల మనోజ్, ప్రధాన కార్యదర్శిగా కోమటిపల్లి రవి, కోశాధికారిగా బక్కశెట్టి రవి, ముఖ్య సలహాదారులుగా రాజన్న, రవి, నాగరాజు, రాజేశ్వర్, గంగాధర్, రాములు, లక్ష్మణ్, నర్సింలు, భీమన్న తదితరులు ఎన్నికయ్యారు.

బాబా ఆలయంలో పూజలు

కుంటాల: మండలంలోని కల్లూర్ సాయిబాబా ఆలయంలో గురువారం భక్తుల సందడి నెలకొంది. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు హారతి కార్యక్రమంలో పాల్గొన్నారు. బాబాను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

రైతుబజార్‌లో..

కూరగాయలు	కిలో(రూ.లో)
టమాటా	15
వంకాయ	50
బెండకాయ	40
పచ్చిమిర్చి	60
కాకరకాయ	50
బీరకాయ	70
క్యారెట్	80
గోరుచిక్కుడు	60
కొత్తిమీర	100
అల్లం	50
ఎల్లిగడ్డ	60
ఉల్లిగడ్డ	20
ఆలుగడ్డ	20

- నిర్మల్‌టౌన్

సినిమాలు



తిరుమల : సార్
నారాయణ: బలగం

విద్యార్థులకు స్టడీమెటీరియల్ పంపిణీ


పుస్తకాలు అందిస్తున్న నాంపల్లి ఎమ్మెల్యే జాఫర్

భైంసాటౌన్: పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థినులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. సలార్ ఎ మిల్లత్ ఎడుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. హైదరాబాద్‌లోని నాంపల్లి ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మెరాజ్ చేతుల మీదుగా విద్యార్థినులకు పుస్తకాలు అందజేశారు. భైంసా మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ జాబీర్ అహ్మద్, ఎంఐఎం నాయకులు ఉన్నారు.

నిర్మల్‌లో..

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఐఏ ఫంక్షన్‌హాల్‌లో ఉర్దూ మీడియంలో పదోతరగతి చదివే విద్యార్థులకు గురువారం నాంపల్లి ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మిరాజ్ ఆల్‌ఇన్‌వన్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు అజీమ్ బిన్ యహ ఆధ్వర్యంలో నిర్వహించారు. కౌన్సిలర్లు సయ్యద్ అజార్, ముజాహిద్ హలీ, మహమ్మద్ ఇర్ఫాన్, ఫిరోజ్, అమన్‌ఖాన్, పాషా, అబ్దుల్ గఫార్, తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా ప్రతిష్ఠాపన


మంగళహారతులతో పాల్గొన్న భక్తులు

కుభీర్: మండల కేంద్రంలో గురువారం దత్తాత్రిస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్వామివారి ప్రతిమను ట్రాక్టర్‌లో ఉంచి వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించగా మహిళలు మంగళహారతులతో హాజరై మొక్కులు తీర్చుకున్నారు. నిరంజన్ మహరాజ్ ఆధ్వర్యంలో పూజాది కార్యక్రమాలను నిర్వహించారు. కుభీర్‌తోపాటు బెల్గాం, పాంగ్ర, గొడ్సర, పార్డి(కె)గ్రామాల ప్రజలు భారీసంఖ్యలో తరలివచ్చి వేడుకల్లో పాల్గొన్నారు.